సాక్షి
జనగామ

మంగళవారం । 31 । డిసెంబర్ । 2024

కొలువుల ఏడాది



- ఈ సంవత్సరం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాలుగువేల వరకు ఉద్యోగాలు

ఈ ఏడాది.. ఉద్యోగాలకాలంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా దాదాపు 4వేల మంది సర్కారు కొలువులకు ఎంపికయ్యారు. వైద్య, పోలీసు, గ్రూప్–4 విభాగాలతోపాటు వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించారు. పోలీసు శాఖలోనే ఎక్కువ నియామకాలు జరగడంతో ఖాకీ డ్రెస్ వేసుకుని మురిసిపోయారు.

- సాక్షి, వరంగల్

రివైండ్ 2024

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $31^0/17^0$

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

'సోమావతి' పూజలు



పాలకుర్తి టౌన్: మార్గశిర సోమావతి అమావాస్యను పురస్కరించుకొని శ్రీసోమేశ్వర లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో సోమవారం ఏకాదశ రుద్రాభిషేకం, అన్నపూజ చేశారు. అనంతరం విశేషపూలతో స్వామివారిని అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించి తరించారు. ఈఓ మోహన్‌బాబు, అర్చకులు డీవీఆర్‌శర్మ, అనిల్‌కుమార్, నాగరాజు, సూపరింటెండెంట్ వెంకటయ్య పాల్గొన్నారు.

జనగామ ఏఎస్పీగా చేతన్ నితిన్



జనగామ: జనగామ ఏఎస్పీగా ఐపీఎస్ అధికారి పండెరె చేతన్ నితిన్ నియమితులయ్యారు. ఈ మేరకు పోస్టింగ్ ఇస్తూ డీజీపీ జితేందర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2022 బ్యాచ్‌కు చెందిన చేతన్ నితిన్ స్వరాష్ట్రం మహారాష్ట్ర. ప్రస్తుతం గ్రేహౌండ్స్‌లో పని చేస్తున్న ఆయన జనగామ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా నియమితు లయ్యారు. నేడు విధుల్లో చేరనున్నట్లు తెలిసింది. ప్రస్తుత ఏసీపీ(ఎఫ్‌ఏసీ) పార్థసారధి గతంలో పని చేసిన వరంగల్ కమిషనరేట్ పరిధి స్పెషల్ బ్రాంచ్‌కు వెళ్లనున్నారు.

ఇద్దరు ఎస్సైల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా పని చేస్తున్న యు.నర్సింహరావును సీసీఆర్‌బీకి, ఐటీ కోర్ ఎస్సైగా పని చేస్తున్న పి.రాజ్‌కుమార్‌ను మడికొండ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

పత్తి కొనుగోలు చేయాలి

జనగామ రూరల్: సీసీఐ కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన పత్తిని కొనుగోలు చేయాలని తెలంగాణ పత్తి రైతు సంఘం రాష్ట్ర కోకన్వీనర్ భూక్యా చందు అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ పరిధి పత్తి మిల్లుల వద్ద ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాలకు రైతులు పత్తి అమ్మకానికి తెస్తే కుంటి సాకులతో తిరస్కరిస్తున్నారని, దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి విక్రయించడం వల్ల రవాణా చార్జీల భారం పడుతోందని చెప్పారు. జిల్లా సహాయ కార్యదర్శి రమావత్ మీట్యా, మంగ బీరయ్య, అజ్మీర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు నివాళి



జనగామ: మున్సిపాలిటీలో సోమవారం చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య అధ్యక్షతన నిర్వహించిన సంతాపసభలో దివంగత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి చైర్‌పర్సన్‌తోపాటు కమిషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పూలమాలలు వేసి మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్లు హరిశ్చంద్రగుప్త, ప్రేమలతారెడ్డి, కళ్యాణి, కౌన్సిలర్లు, మేనేజర్, వార్డు ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు



జనగామ : జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆధ్వర్యాన పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. వరంగల్–హైదరాబాద్, సిద్దిపేట–సూర్యాపేట హైవే, నెహ్రూ పార్క్ ఏరియాలో వాహనాలను తనిఖీ చేశారు. సీఐ దామోదర్ రెడ్డి, ఎస్‌ఐలు రాజేష్, రాజన్‌బాబు, చెన్నకేశవులు, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా సోమరాములు




పాలకుర్తి టౌన్: తెలంగాణ దివ్యాంగుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా మండల పరిధి తొర్రూరు గ్రామానికి చెందిన పులి సోమరాములును నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.మహబూబ్ అలీ సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. దివ్యాంగుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని సోమరాములు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఉపాధ్యాయ ఓటర్లు @ 24,905

- వరంగల్ -ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ తుది ఓటరు జాబితా విడుదల
- మూడు నెలల ప్రక్రియకు తెర
- 12 జిల్లాలు, 200 పోలింగ్ కేంద్రాలు
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం..
- 2025 ఫిబ్రవరి.. లేదంటే మార్చిలో ఎన్నికలు..?





సాక్షిప్రతినిధి, వరంగల్ :

వరంగల్-నల్లగొండ-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను సోమవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య విడుదల చేశారు. మొత్తం 24,905 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవీ కాలం 2025 మార్చి 29తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు పాత ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 30న రద్దు చేసింది. ఉపాధ్యాయులు తిరిగి తమ ఓటుహక్కును అక్టోబర్ 1 నుంచి నమోదు చేసుకోవాలని. ఆన్‌లైన్ పద్ధతుల్లో ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మూడు నెలలుగా సాగిన ప్రక్రియ అనంతరం 24,905 మంది అర్హత గల ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. కాగా ఎన్నికల సంఘం, ఏర్పాట్ల స్పీడును బట్టి వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో ఎన్నికల జరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

2019తో పోలిస్తే పెరిగిన ఓటర్లు...

2019 మార్చిలో జరిగిన వరంగల్ - నల్లగొండ - ఖమ్మం శాసన మండలి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో మొత్తం 20,888 మంది ఓటర్లు ఉన్నారు. ఇందుకోసం 181 పోలింగ్ కేంద్రాలు అప్పుడు ఏర్పాటు చేశారు. 2025 మార్చిలో ఎమ్మెల్సీ పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో సెప్టెంబర్ 30న పాత జాబితాను రద్దు చేసి కొత్తగా ఓటర్ల నమోదుకు నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా నవంబర్ 23న ప్రకటించిన ముసాయిదా జాబితా నాటికి 22,554 మంది ఓటర్లు నమోదయ్యారు. ఆ తర్వాత కూడా ఓటర్ల నమోదుకు దరఖాస్తుల గడువు పెంచగా.. డిసెంబర్ 30 (సోమవారం) నాటికి 24,905 మంది ఓటర్లుగా నమోదైనట్లు ఎన్నికల సంఘం తుది జాబితా ప్రకటించింది. ముసాయిదా జాబితాకు ఫైనల్ జాబితాకు 2,351 మంది ఓటర్లు పెరగగా.. 2019 ఓటర్ల జాబితాతో పోలిస్తే 4,017 మంది ఉపాధ్యాయుల ఓట్లు పెరిగాయి.

ఉమ్మడి వరంగల్‌లో ఓటర్లు 10,797...

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 24,905 మంది ఓటర్లలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఆరు జిల్లాల నుంచి 6,509 మంది పురుషులు, 4,288 స్త్రీల ఓటర్లు కలిపి మొత్తం10,979 మంది ఉన్నారు. అత్యధికంగా హనుమకొండ జిల్లాలో 5,098 మంది ఓటర్లు నమోదు కాగా, ఆ తర్వాత వరంగల్‌లో 2,225, మహబూబాబాద్‌లో 1,618, జనగామలో 921, ములుగులో 612, జేఎస్ భూపాలపల్లిలో 323 మంది ఉపాధ్యాయ ఓటర్లున్నారు.

పురుష ఓటర్లే అధికం..

ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మంలకు చెందిన 12 జిల్లాల్లో నమోదైన మొత్తం 24,905 మంది ఉపాధ్యాయ ఓటర్లలో అత్యధికంగా పురుషులే ఉన్నారు. 9,965 మంది మహిళా ఓటర్లు నమోదు కాగా, పురుషులు 14,940 మంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం ఈసారి 12 జిల్లాల్లోని 191 మండలాల్లో 200 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాల వారీగా మండలాలు, పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు..

జిల్లా	మండలాలు	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	మొత్తం
సిద్దిపేట	04	04	120	43	163
జనగామ	12	12	556	365	921
హనుమకొండ	11	15	2,884	2,214	5,098
వరంగల్	13	13	1,381	844	2,225
మహబూబాబాద్	18	16	1,083	535	1,618
భూపాలపల్లి	07	07	211	11	323
ములుగు	09	09	394	218	612
భద్రాద్రి	23	23	1,038	941	1,949
ఖమ్మం	21	24	2,300	1,655	3,955
యాదాద్రి	17	17	595	326	921
సూర్యాపేట	23	23	1,690	947	2,637
నల్లగొండ	33	37	2,688	1,795	4,483
మొత్తం	191	200	14,940	9,965	24,905

'మాంజా'.. యమడేంజర్



పతంగుల దారాలు



గాయపడ్డ ఐదేళ్ల బాలుడు వీక్షిత్

- ప్రాణాలు తీస్తున్న చైనా మాంజా
- యువకుడు, బాలుడికి తీవ్ర గాయాలు
- గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు..!

జనగామ: ప్రజల ప్రాణాలు తీస్తున్న చైనా మాంజా దారాలను ప్రభుత్వ నిషేధించినా గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు చేస్తున్నారు. సంక్రాంతి పండగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే పతంగుల పోటీలు జోరందుకున్నాయి. మట్కా, ఆన్‌లైన్ గేమింగ్ మాదిరిగానే 'కైట్' పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రూపులుగా విడిపోయి పందెం కాస్తూ చైనా మాంజాతో పోటీ పడుతున్నారు. పతంగి తెగిపోయిన తర్వాత చెట్టు లేదా కరెంటు తీగలు, విద్యుత్ స్తంభాలకు చిక్కుకునే మాంజా దారం వాహన చోదకులకు ప్రాణాంతకంగా మారుతోంది. గతంలో చైనా మాంజా తగిలి అనేక మంది గాయపడగా.. కొన్ని ప్రాంతాల్లో మరణాలు సైతం సంభవించిన విషయం తెలిసిందే.

రెండు రోజుల క్రితం..

జిల్లా కేంద్రం ఫ్లైవోవర్‌పై రెండు రోజుల క్రితం యువకులు సనత్‌కుమార్, సాయికుమార్, సాయిరాం బైక్‌పై వెళ్తుండగా గాలి దుమారానికి కొట్టుకు వచ్చిన చైనా మాంజా మెడకు తగిలి సనత్ కుమార్ కిందపడిపోయారు. మెడ కోతకు గురికావడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆదే సమయంలో వడ్లకొండ గ్రామానికి చెందిన ఓ కుటుంబం బైక్‌పై బస్టాండ్ వైపు వెళ్తుండగా మాంజా ద్విచక్ర వాహనంపై ముందు కూర్చున్న ఐదేళ్ల బాలుడు వీక్షిత్ మెడకు తీవ్ర గాయం చేసింది. అతడు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం ఇదే ఫ్లైవోవర్‌పై ఉన్న కేబుల్ వైర్‌ను సైతం చైనా మాంజా కట్ చేసిందంటే ఎంతటి అనర్థాలకు దారి తీస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. అధికారుల నిఘా లోపంతోనే చైనా మాంజా అమ్మకాలు ఆగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా చైనా మాంజా విక్రయాన్ని పూర్తిగా అరికట్టాలని బాధిత కుటుంబాల సభ్యులు కోరుతున్నారు.



మెడకు గాయమైన యువకుడు సనత్‌కుమార్

బోనమెత్తిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



బోనాలతో ర్యాలీగా వస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

జనగామ రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ కలెక్టరేట్ ఎదురుగా చేపట్టిన నిరవధిక దీక్షలు సోమవారం కొనసాగాయి. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరు రమేశ్ ఆధ్వర్యాన సుమారు 200 మంది మహిళా ఉద్యోగులు బోనాలతో ఆర్టీసీ చౌరస్తా వరకు డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, దేవతా మూర్తుల వేషధారణలతో ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. అనంతరం ఆర్టీసీ చౌరస్తా నుంచి నేరుగా బతుకమ్మకుంట శ్రీ విజయదుర్గామాత ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు దయాకర్ గౌడ్, గోరంట్ల యాదగిరి, బక్కం రాజకుమార్, రొయ్యల రాజు, హరిప్రసాద్, వెంకటేశ్వర్లు, రమేశ్, మహాలక్ష్మి, ప్రశాంతి, నీరజ, రాణి, సుకన్య, పుష్పలత, శోభ, అన్నపూర్ణ, రమ్య, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'హబ్' సేవలకు అంతరాయం ఉండదు

- రెండు రోజుల్లో జనరేటర్ మరమ్మతు..
- డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు

సాక్షి ఎఫెక్ట్..



జనరేటర్ గురించి ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ

జనగామ: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న తెలంగాణ డయాగ్నోస్టిక్ (రక్త పరీక్షల కేంద్రం) సెంటర్ సేవలకు అంతరాయం ఉండదు.. నిరంతరం కొనసాగుతాయని జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్‌ఓ) డాక్టర్ మల్లికార్జున్‌రావు అన్నారు. డయాగ్నోస్టిక్ సెంటర్‌లోని జనరేటర్ మూలన పడగా.. కరెంటు అంతరాయం తలనొప్పిగా మారింది. సెల్‌ఫోన్ లైట్ల సహాయంతో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితుల్లో హబ్ టెక్నీషియన్లు గోస పడుతున్నారు. దీనిపై 'పరీక్షలకే పరీక్ష' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా.. డీఎంహెచ్‌ఓ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావును వివరణ కోరారు. రక్త పరీక్షల సమయంలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కావొద్దని ఆదేశించారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వెళ్లి రిపేరుకు వచ్చిన జనరేటర్, ఇతర సమస్యలు తెలుసుకున్నారు. రోజువారీగా రక్త పరీక్షలు, వాటికి సంబంధించిన కెమికల్స్, ఖర్చు తదితరాల గురించి ఆరా తీశారు. అనంతరం మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ సెంటర్ నిర్వహణ పూర్తిగా డీఎంఈ పరిధిలోకి వస్తుందని, ఇందుకు సంబంధించి ఉత్తర్వులు వచ్చాయన్నారు. నిర్వహణ, రిపేర్లు తదితర ఖర్చులను జిల్లా ఆస్పత్రి నిధుల నుంచి వెచ్చించాల్సి ఉంటుందని, అయినప్పటికీ తాము ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ సేవలకు ఇబ్బంది కలుగకుండా నిత్యం పర్యవేక్షిస్తామని చెప్పారు. రెండు రోజుల్లో జనరేటర్ మరమ్మతుకు సంధించి పనులు పూర్తి చేయిస్తామన్నారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

పాలకుర్తి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేపట్టామని విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ రాజ్ చౌహాన్ అన్నారు. మండల పరిధి తొర్రూరు (జె)లో చేపట్టిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో సోమవారం టెక్నికల్ చార్జ్ ప్రారంభించారు. సాంకేతిక సమస్యలను గుర్తించడంతోపాటు ప్రమాదాల నివారణకు ముందస్తుగా సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ చార్జ్ చేశామన్నారు. డీఈ రాంబాబు, విజయ్‌కుమార్, గణేష్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు బోయిని సత్తయ్య, ఆవిరినేని రణధీర్, సబ్ ఇంజనీరు రామకృష్ణ, లైన్ ఇన్‌స్పెక్టర్ కాంతయ్య, లైన్‌మెన్లు వెంకటేశ్వర్లు, రాజలింగం పాల్గొన్నారు.

రైతులు రశీదులు పొందాలి : ఏడీఏ

బచ్చన్నపేట : ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు ఫర్టిలైజర్ దుకాణదారుల వద్ద తప్పకుండా రశీదులు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్ఎస్ బీనా అన్నారు. సోమవారం స్థానిక ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపుల్లో రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. నాణ్యమైన ఎరువులు అందించడమే కాకుండా అవసరమైన సాగు సలహాలు అందించాలని చెప్పారు. అధిక ధరలు వసూలు చేస్తూ.. వేరే మందులను లింకు పెట్టినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, సీఈఓ బాలస్వామి, నరేందర్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెరుగుతుంది

- వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఉమారెడ్డి



డ్రోన్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

జఫర్‌గఢ్: వ్యవసాయంలో అనేక మార్పులు వస్తున్నాయి.. వచ్చే రెండు మూడేళ్లలో డ్రోన్ల వినియోగం పెరిగి తక్కువ శ్రమతో సులభంగా పంటలు పండించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఉమారెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వరి పరిశోధన సంస్థ, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరంగల్ ఆధ్వర్యాన మండల పరిధి రఘునాథ్‌పల్లిలో సోమవారం డ్రోన్ ద్వారా వరి సాగుపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమారెడ్డితోపాటు శాస్త్రవేత్తలు వర్మ, కిరణ్ బాబు దిలీప్‌కుమార్, ఓంప్రకాశ్, రైతులు సోమిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమేది..?

- గ్రీవెన్స్‌లో ప్రజల ఆవేదన
- వివిధ అంశాలపై 69 వినతులు
- స్వీకరించిన అదనపు కలెక్టర్, ఇతర అధికారులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, అధికారులు

జనగామ రూరల్: ఎన్నో వ్యయప్రయాసలకోర్చి.. ఆర్థిక ఇబ్బందులున్నా సుదూర ప్రాంతాల నుంచి చార్జీలు పెట్టుకుని కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు ఇస్తే.. సమస్యలు పరిష్కారం కావడంలేదని పలువురు వాపోయారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై ప్రజలు 69 దరఖాస్తులు ఇవ్వగా వాటిని ఆర్డీఓలు గోపీరాం, వెంకన్నతో కలిసి అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు అంకితభావంతో పనిచేసి ప్రజాసమస్యలు పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే 80 శాతం పూర్తయిందని, మిగిలిన దరఖాస్తుల సర్వే త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఘనపూర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హనుమాన్ నాయక్, డీఆర్‌డీఓ వసంత, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి సరస్వతి, సంక్షేమాధికారి ఫ్లోరెన్స్, డీఏఓ రామారావు, సీపీఓ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని ఇలా..

- ఏ ఆధారమూ లేదు. ప్రజాపాలన దరఖాస్తులో పేరు చేర్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని జనగామ మండల కేంద్రం వీవర్స్ కాలనీకి చెందిన ఎస్.ప్రమీల అర్జీ పెట్టుకున్నారు.
- తండ్రి సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన ఎకరం భూమిని తన పేరు మీదకు మార్చి ధరణిలో ఎక్కించి పాసుబుక్ ఇప్పించాలని దేవరుప్పుల మండలం చౌడారం గ్రామానికి చెందిన ఇనుముల నర్సయ్య దరఖాస్తు ఇచ్చాడు.
- తన రెండున్నర ఎకరాల భూమికి పాస్‌బుక్ మంజూరు చేయాలని అధికారులకు దరఖాస్తు చేసినా ఫలితం లేదని చిల్పూర్ మండలం వెంకటాద్రిపేటకు చెందిన ఆవుల వెంకటయ్య ఫిర్యాదు చేశారు.
- స్టేషన్‌రోడ్డును ఆనుకుని ఉన్న తన గృహానికి సంబంధించి అనుమతి లేకుండా రికార్డులో ఇంటి పేరు మార్చారు.. తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కేంద్రం శివాలయం వీధికి చెందిన చందా లక్ష్మణ్‌రావు విజ్ఞప్తి చేశారు.
- రెండు గుంటల సొంత భూమిలో ఇల్లు నిర్మించుకున్నాను.. ఇంటి నంబర్ ఇప్పించాలని దేవరుప్పుల మండలం రామచంద్రాపురానికి చెందిన కె.నానాజీ దరఖాస్తు ఇచ్చాడు.

డబుల్ బెడ్రూం ఇచ్చి ఆదుకోవాలి



నేను 2016 సంవత్సరం డబుల్ బెడ్రూం కోసం దరఖాస్తు చేసుకున్న. నా భర్త 11 ఏళ్ల క్రితం వదిలి వెళ్లిపోయిండు. ఉండడానికి ఇల్లు లేదు. కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాను. గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇచ్చి ఆదుకోవాలి.

- బొమ్మన రేణుక, అక్కరాజుపల్లి(తరిగొప్పుల)



"పై ఫొటోలోని దివ్యాంగ మహిళ పేరు ఎండీ.గౌసియా. కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన ఈమెకు ఏడేళ్ల క్రితం పక్షవాతం వచ్చి మంచానికే పరిమితం అయింది. అలాగే కుడికాలు పూర్తిగా విరిగిపోవడంతో లేవలేని స్థితిలో ఉంది. 2021లో 50 శాతం వైకల్యంతో తాత్కాలిక పద్ధతిన మూడేళ్లకు సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. తిరిగి మళ్లీ సదరం క్యాంపునకు వెళ్తే సర్టిఫికెట్‌లో 22 శాతం వేయడంతో పింఛన్ రావడంలేదు. మందుల ఖర్చులకు ఇబ్బంది అవుతోంది. ఆసరా పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని గౌసియా కలెక్టరేట్‌లో అర్జీ పెట్టుకుంది."

పరిహారం, ఉద్యోగం ఇప్పించాలి



విద్యుత్ శాఖలో పనిచేసే నా భర్త జాటోత్ వీరన్న ప్రమాదంలో 2015 సంవత్సరం మరణించాడు. అధికారులు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. రూ.ఆరు లక్షలు మాత్రమే ఇచ్చారు. కోర్టును ఆశ్రయించగా ఉద్యోగం ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చారు. మిగిలిన పరిహారం, ఉద్యోగం ఇప్పించాలి.

- జాటోత్ శాంతమ్మ, బొంతగట్టునాగారం(తరిగొప్పుల)

సీసీఐ కేంద్రాలకు రేపటి నుంచి సెలవులు

జనగామ: జిల్లాలోని సీసీఐ(పత్తి కొనుగోలు) కేంద్రాలకు జనవరి 1 నుంచి ఐదురోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు జనగామ ఏఎంసీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. న్యూ ఇయర్ సందర్భంగా జనవరి 1న సెలవు ఉంటుందని, అలాగే సీసీఐ కేంద్రాల్లో పత్తి నిల్వలు పేరుకుపోయిన దృష్ట్యా 2, 3 తేదీల్లో మూసి వేయనున్నట్లు పేర్కొన్నారు. 4, 5 తేదీల్లో సెంటర్లకు సెలవు అని, ఆరో తేదీ తిరిగి కొనుగోళ్లు పునఃప్రారంభమవుతాయన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా జనగామ

- 11 దుకాణాలకు ముందస్తు నోటీసులు



యజమానికి నోటీసు అందజేస్తున్న పులి శేఖర్

జనగామ: పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం అవసరమని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన ఆదేశాల మేరకు వార్డు ప్రత్యేక అధికారి పులి శేఖర్ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు 11 దుకాణాలకు ముందస్తు నోటీసులు ఇచ్చారు. పట్టణంలో 112 దుకాణాలు ఉన్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యాపార, వాణిజ్య సంస్థలు ఇక నుంచి ప్లాస్టిక్ కవర్లు విక్రయించొద్దని, అదే సమయంలో ప్రజలు వాటిని వినియోగించవద్దని అన్నారు. ప్రమాద రహిత బ్యాగులను మాత్రమే వాడాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు విక్రయించిన వారికి రూ.5వేల నుంచి రూ.25వేల వరకు జరిమానా విధించడమే కాకుండా అవసరమైతే షాపును సీజ్ చేస్తామని అన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి ప్లేట్ లోడ్ టెస్ట్



వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయ పరిధిలోని కామేశ్వరాలయ పునర్నిర్మాణానికి కేంద్ర పురావస్తుశాఖ అధికారులు సోమవారం ప్లేట్ లోడ్ టెస్ట్ నిర్వహించారు. కామేశ్వరాలయ నిర్మాణ ప్రదేశం.. శిల్పాల బరువును ఎంతమేర తట్టుకుని నిలబడుతుందో తెలుసుకోవడానికి ప్లేట్ లోడ్ టెస్ట్ నిర్వహించామని కేంద్ర పురావస్తుశాఖ డైరెక్టర్ అజ్మీరా భీమా, డిప్యూటీ సూపరింటెండెంట్ చంద్రకాంత్, హెచ్ఆర్ దేశాయి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్, వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ నవీన్‌కుమార్ తెలిపారు. 20 నుంచి 100 టన్నుల వరకు ఐదు దశల్లో (ఇసుకతో కూడిన సంచులు) బరువు వేసి టెస్ట్ చేసినట్లు వారు వెల్లడించారు.

ముగిసిన నాటక ఉత్సవాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం భీమారంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నాలుగు రోజులు నిర్వహించిన పందిళ్ల శేఖర్‌బాబు స్మారక రాష్ట్ర స్థాయి నాటక పోటీలు సోమవారం ముగిశాయి. చివరి రోజు 'మహారాణి రుద్రమ్మదేవి చారిత్రాత్మక పద్యనాటకం' ఆకట్టుకుంది. కాకతీయ నాటక పరిషత్ అధ్యక్షుడు రాజారపు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో తడకమళ్ల రాంచందర్‌రావు రచనలో దేవరాజు రవీందర్‌రావు దర్శకత్వంలో ఈనాటకం ప్రదర్శించారు. ఈ నాటకానికి సురభి కొండల్‌రావు సంగీతం అందించారు. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ శేఖర్‌బాబు భౌతికంగా లేకపోయినా ఆయన ప్రదర్శించిన నాటకాలు, కళానైపుణ్యం సంజీవంగా ఉన్నాయన్నారు. కాగా, అటికం రాజమ్మ–ఎల్లగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాకారులకు నాలుగు రోజులు భోజన సౌకర్యం కల్పించారు. కళాకారుడు లక్ష్మీకాంతారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం, జిల్లా అధ్యక్షుడు ఓడపల్లి చక్రపాణి, బాలాజీరావు, మోత్కురు మనోహర్‌రావు, శ్యాంప్రసాద్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్‌గౌడ్, కళాకారులు మాడిశెట్టి రమేశ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేయూ భూముల సర్వే

- వలుచోట్ల మార్కింగ్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ సర్వే నంబర్లలోని భూముల్లో సోమవారం సర్వే నిర్వహించారు. పలివేల్పులవైపు ఉన్న 373, 414 సర్వే నంబర్లలో సర్వే నిర్వహించారు. పలు చోట్ల మార్కింగ్‌ను కూడా చేశారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ పవన్, సర్వేయర్ రాజేశ్ సర్వే చేస్తున్నారు. ఈనెల 28న లష్కర్‌సింగారం కుమార్‌పల్లి 38 సర్వేనంబర్ భూమిలో కూడా సర్వే నిర్వహించారని కేయూ అభివృద్ధి అధికారి వాసుదేవరెడ్డి తెలిపారు. మరో రెండు మూడు రోజులు సర్వే కొనసాగే అవకాశం ఉందని సమాచారం. ఈ కార్యక్రమం పూర్తయి యూనివర్సిటీ భూములకు మార్కింగ్ పూర్తయితే క్యాంపస్ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడుతారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఆగిన పాఠాలు..

కాంట్రాక్ట్ సీఆర్‌టీల ధర్నా

- రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్
- పదో తరగతి సిలబస్ పూర్తి కాక విద్యార్థులు ఇబ్బందులు
- సమ్మెతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం



ములుగు జిల్లాలో ధర్నా చేస్తున్న సీఆర్‌టీలు (ఫైల్)

మహబూబాబాద్ అర్బన్ : గిరిజన ఆశ్రమ పాఠశాలలో పాఠాలు జరగడం లేదు. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్‌టీ) తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఐటీడీఏ పరిధుల్లో ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఫలితంగా సిలబస్ పూర్తి కాక పదో తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 20 ఏళ్లుగా పని చేస్తున్నా తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అందుకే ఉద్యోగ భద్రత కోసం పోరాటం తప్ప మరో మార్గం లేదని భావించి సమ్మె చేస్తున్నామని సీఆర్‌టీలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని వారు స్పష్టం చేస్తున్నారు. కాగా, సీఆర్‌టీల సమ్మె ప్రభావం రానున్న పదో తరగతి వార్షిక పరీక్షలపై పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల వివరాలు

జిల్లా	పాఠశాలలు	సీఆర్‌టీల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ములుగు	37	55	7070
మానుకోట	25	109	6810
జనగామ	07	20	1151
వరంగల్	07	24 మంది	1278
హనుమకొండ	07	16	851
భూపాలపల్లి	11	47	1657

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆశ్రమ పాఠశాలల్లో సుమారు 1,500 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉన్నారు.

డిమాండ్లు ఇవే..

- కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లకు మినిమమం టైంస్కేల్, ఉద్యోగ భద్రత కల్పించాలి.
- సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి.
- ప్రతి నెల 1న గ్రీన్‌చానల్ ద్వారా జీతాలు చెల్లించాలి.
- మహిళా టీచర్లకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు వర్తింపజేయాలి.
- ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- పీఎఫ్ సౌకర్యం అందించాలి.
- 61 సంవత్సరాలు నిండిన సీఆర్‌టీలకు రూ. 20 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలి.
- సీఆర్‌టీలందరికీ హెల్త్‌కార్డు సౌకర్యం అందించాలి.
- మహిళా సీఆర్‌టీలకు చైల్డ్‌కేర్ సెలవులు మంజూరు చేయాలి

విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం..



టీచర్లు రాకపోవడంతో చదువుకుంటున్న విద్యార్థులు

ఆశ్రమ పాఠశాలలో ఎస్జీటీలు 5వ తరగతి వరకు పాఠాలు బోధిస్తారు. 6 నుంచి 10వ తరగతి వరకు స్కూల్ అసిస్టెంట్లు స్థానంలో ఉన్న సీఆర్‌టీలు బోధిస్తారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ప్రత్యేక సమయం కేటాయించి విద్యార్థులను సన్నద్ధం చేయాల్సి ఉంది. ఈ క్రమంలో సీఆర్‌టీల ధర్నాతో పదో తరగతిలో ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్, తెలుగు సబ్జెక్ట్‌లో పూర్తి స్థాయిలో సిలబస్ కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్జీటీలు పాఠాలు చెప్పినా అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఇలాంటి కీలక సమయంలో సీఆర్‌టీల సమ్మెతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టీచర్లు రాకపోతే ఎలా చదవాలి?



ఇప్పటి వరకు ఫిజిక్స్, మ్యాథ్స్, సబ్జెక్టులు పూర్తి కాలేదు. టీచర్లు రాకపోవడంతో పదో తరగతి వార్షిక పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి. సందేహాలు ఎవరు తీర్చాలి. ఫెయిలైతే ఎవరు బాధ్యులవుతారు.

– బి.శాలిని, పదోతరగతి, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, మానుకోట

సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి



20 సంవత్సరాల నుంచి రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విద్యార్థులకు బోధన చేపడుతున్నాం. 2005కు ముందు పదో తరగతిలో 10 శాతం ఉత్తీర్ణత ఉండగా, ఆ తర్వాత మాతోనే గిరిజన ఆశ్రమ పాఠశాలలో 95 శాతం పెరిగింది. ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించి సర్వీస్ క్రమబద్ధీకరించాలి.

– గుగులోత్ చిట్టిబాబు, సీఆర్‌టీ, పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానుకోట జిల్లా

ప్రతీ నెల 1వ తేదీన వేతనం చెల్లించాలి



రాష్ట్రవాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో బోధిస్తున్న సీఆర్‌టీలకు ప్రతి నెల వేతనాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం. ప్రభుత్వం మాకు ప్రతి నెల 1న వేతనాలు చెల్లించాలి. మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి.

– లకావత్ రాములు సీఆర్‌టీ, జనగామ జిల్లా

రెగ్యులర్ ఉపాధ్యాయులతో బోధిస్తున్నాం



ఆశ్రమ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లతో పదో తరగతి విద్యార్థులకు పూర్తికాని సబ్జెక్టులను బోధిస్తున్నాం. ఎక్కడా విద్యార్థులుకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటూ వార్షిక పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం.

– గుగులోత్ దేశిరాం, ఏటీడీఓ ములుగు, మానుకోట జిల్లాల ఇన్‌చార్జ్

పులి కాదు.. జంగపిల్లి

- నిర్ధారించిన అటవీశాఖ అధికారులు
- శనిగరం శివారులో పులిపిల్ల కలకలం

నల్లబెల్లి: నల్లబెల్లి మండలంలో నాలుగు రోజుల నుంచి పెద్దపులి అలజడి కొనసాగుతోంది. సోమవారం శనిగరం శివారులో పెద్దపులిని చూసినట్లు రైతులు.. పోలీసు, ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో మరోసారి అలజడి నెలకొంది. ఎస్సై గోవర్ధన్ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని రైతులతో చర్చించారు. తాము పెద్దపులి పిల్లను చూసినట్లు తెలపడంతో సమీపంలోని మొక్కజొన్న చేనులో గాలించారు. ఈ క్రమంలో చేను నుంచి పులిపిల్ల పరిగెత్తినట్లు రైతులు చెప్పడంతో పోలీసులు కూడా ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సోమనాయక్ పర్యవేక్షణలో సిబ్బంది వెంటనే ఘటనా స్థలికి చేరుకుని పాదముద్రలు సేకరించింది. రైతులకు కనిపించింది పులి పిల్ల కాదు.. జంగపిల్లి అని గుర్తించినట్లు సోమానాయక్ తెలిపారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



మొక్కజొన్న చేనులో పెద్దపులి పిల్ల ఆచూకీ కోసం గాలిస్తున్న ఎస్సై గోవర్ధన్, సిబ్బంది

పలుగు ఏనేలో డ్రోన్‌తో పరిశీలన..

పులి అరుపులు విన్నట్లు రుద్రగూడెం, కొండాయిల్‌పల్లి గ్రామాలకు చెందిన రైతులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో ఎఫ్ఎస్ఓ సోమనాయక్ పర్యవేక్షణలో సిబ్బంది రుద్రగూడెం, కొండాయిల్‌పల్లి పలుగు ఏనేకు చేరుకుని డ్రోన్ కెమెరాతో పెద్దపులి సంచరించిన ప్రాంతాన్ని చిత్రీకరించారు. పులి సంచరించిన ఆనవాళ్లు, పంట చేళ్ల నుంచి అటవీ ప్రాంతానికి వెళ్లినట్లు గుర్తించారు. నల్లబెల్లి మండలంలో సంచరించిన పులి మహబూబాబాద్ అటవీ ప్రాంతానికి వెళ్లిందని తెలిపారు. గ్రామాల్లో కొనసాగుతున్న ప్రచారాలకు ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

మనస్తాపంతో డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

- నందనాయక్‌తండా ఎస్టీ కాలనీలో ఘటన



విష్ణు(ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం నందనాయక్ తండా ఎస్టీ కాలనీకి చెందిన డిగ్రీ విద్యార్థి బాదావత్ విష్ణు(22) మనస్తాపంతో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. నందనాయక్‌తండా ఎస్టీ కాలనీకి చెందిన విష్ణు హనుమకొండ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో బీకాం ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. కొన్ని నెలల క్రితం ఫైనాన్స్‌లో బైక్ కొనుగోలు చేశాడు. బైక్ ఎక్కడిదని తల్లిదండ్రులు అడిగితే హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నానని, ఫైనాన్స్‌లో తీసుకున్నానని చెప్పాడు. అలాగే, అతడు జూన్‌లో తన బైక్‌తో యాక్సిడెంట్ చేశాడని తల్లిదండ్రులకు తెలిసింది. క్రిస్మస్ రోజు ఇంటికి వచ్చి మరుసటి రోజు 26వ తేదీన కుటుంబీకులకు చెప్పి కాలేజీకి వెళ్లాడు. ఈ క్రమంలో సోమవారం మృతుడి తల్లిదండ్రులు నర్సింహ, కవిత తమ వ్యవసాయ బావివద్దకు వెళ్లారు. అక్కడ బైక్, చెప్పులు, సెల్‌ఫోన్ ఉండడంతో అనుమానం వచ్చి తన కుమారుడు బావిలోకి దూకి ఉంటాడని భావించి 100కు డయల్ చేశారు. గ్రామస్తులు మోటార్లు ఏర్పాటు చేసి నీటిని తోడి మృతదేహాన్ని వెలికితీశారు. తన కుమారుడు ఫైనాన్స్‌లో బైక్‌ను తీసుకుని కొనుగోలు చేయడంతో పాటు హైదరాబాద్‌లో చేసిన యాక్సిడెంట్ విషయంలో మనస్తాపం చెంది బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

సైబర్ మోసం..

- ఫోన్ కాల్ లిఫ్ట్ చేయడంతో రూ.8.14 లక్షలు మాయం
- కొద్ది గంటల్లోనే మూడు బ్యాంకు ఖాతాలు గుల్ల చేసిన కేటుగాళ్లు
- లబోదిబోమంటూ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



గార్ల : ప్రభుత్వాలు ఎంత కట్టడి చేసిన సైబర్ మోసాలు ఆగడం లేదు. కేటుగాళ్లు ఏదో రూపంలో అమాయకుల ఖాతాలను గుల్లచేస్తూనే ఉన్నారు. దీనికి నిదర్శనమే ఈ ఘటన. అగంతకుడు ఫోన్ చేయడంతో ఓ వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేసి హలో అన్నాడు. అంతే.. కొద్ది గంటల్లోనే అతడి 2 బ్యాంకు అకౌంట్లు, తన తల్లి అకౌంట్ నుంచి రూ.8.14 లక్షలు మాయమయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం బుద్దారంతండాలో చోటుచేసుకుంది. ఎస్సై రియాజ్‌పాషా కథనం ప్రకారం.. తండాకు చెందిన వాంకుడోత్ సంతోశ్‌కుమార్ కడపలోని జోయాలుక్కాస్ గోల్డ్ షోరూంలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సంతోశ్‌కు ఈనెల 5వ తేదీన ఓ అగంతకుడు +447873 078154 నంబర్‌తో ఫోన్ చేశాడు. కాల్ లిఫ్ట్ చేసి హలో అని అనగానే కట్ అయ్యింది. అనంతరం అగంతకుడు గంట తర్వాత సంతోశ్ ఫోన్ సిమ్‌ను బ్లాక్ చేశాడు. డ్యూటీలో బిజీగా ఉండడంతో సంతోశ్ సిమ్‌ను సరిచేసుకోలేకపోయాడు. సిమ్ బ్లాక్ అయిన నేపథ్యంలో సంతోశ్ బ్యాంకు అకౌంట్ల నుంచి రూ.8.14 లక్షలు డ్రా అయినా మొబైల్‌కు మెసెజ్‌లు రాలేదు. ఈనెల 17న బాధితుడు గార్లకు వచ్చి బ్యాంకులో డబ్బు డ్రా చేసేందుకు వెళ్లగా తన రెండు అకౌంట్ల నుంచి రూ.1,28,000, రూ.1,23,000, తన తల్లి అకౌంట్ నుంచి రూ.5,63,000 డ్రా అయినట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు. 2 అకౌంట్లతో పాటు, తల్లి అకౌంట్‌కు సైతం సంతోశ్ తన సెల్ నంబర్‌ను లింక్ చేశాడు. దీంతో లబోదిబోమంటూ గార్ల పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరికైనా +44, +11, +55 నుంచి 12 అంకెలతో ఫోన్ వస్తే లిఫ్ట్ చేయొద్దని ఎస్సై సూచించారు. అకౌంట్ల నుంచి డబ్బులు డ్రా అయినట్లు మెసెజ్‌లు వస్తే వెంటనే 1930 సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇస్తే అకౌంట్లను వెంటనే బ్లాక్ చేస్తారని ఎస్సై పేర్కొన్నారు.

డీలర్‌షిప్ పేరుతో మోసం.. రూ. 7 లక్షలు స్వాహా..

కొడకండ్ల : డీలర్‌షిప్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసానికి పాల్పడ్డారు. అమాయకుడి వద్ద రూ.7 లక్షలు కొల్లగొట్టారు. ఈ ఘటన మండలంలోని హక్యతండాలో చోటు చేసుకుంది. పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి కథనం ప్రకారం.. తండా చెందిన గుగులోత్ అశోక్ ఫెర్టిలైజర్ ఇండియాలో డీలర్‌షిప్ ఉందని ఫేస్‌బుక్‌లో ఓ యాడ్ చూశాడు. యాడ్‌పై క్లిక్ చేయగా వివరాలు కనిపించడంతో నమోదు చేశాడు. యాడ్ నిర్వాహకులు చెప్పినట్లు ఆరు నెలల నుంచి విడతల వారీగా ఆన్‌లైన్‌లో రూ.7 లక్షలు చెల్లించాడు. అయినా వారి నుంచి సమాధానం రాకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి సోమవారం తెలిపారు.

కొలువుల ఏడాది..

- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నాలుగు వేల వరకు ఉద్యోగాలు
- పోలీసు విభాగంలోనే అత్యధికంగా నియామకాలు
- ఆ తర్వాతి స్థానంలో టీచర్లు, గ్రూప్–4 జాబ్స్



సాక్షి, వరంగల్: ఈ ఏడాది యువతలో ఉద్యోగానందం కనిపించింది. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా దాదాపు 4వేల మంది సర్కారు కొలువులకు ఎంపికయ్యారు. వైద్య, పోలీసు, గ్రూప్ –4 విభాగాలతోపాటు వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించారు. జూన్ 9న గ్రూప్–4, అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్ –1 మెయిన్స్ నిర్వహించారు. డిసెంబర్ 15న నిర్వహించిన గ్రూప్–2 పరీక్షకు 63,872 మంది హాజరయ్యారు. గ్రూప్–3 సహా అన్ని రకాల పోటీ పరీక్షలను లక్ష మందికి పైగా రాశారు. ఇందులో చాలా మంది ప్రభుత్వ కొలువులు సాధించారు. డీఎస్సీ ద్వారా వందలాదిమందికి అక్టోబర్ 15న ఉపాధ్యాయులుగా పోస్టింగ్ ఇచ్చారు. గురుకులాలు, ఆదర్శపాఠశాలల్లో 400 మంది ఉద్యోగాలు సాధించారు. వైద్యారోగ్య విభాగంతో పాటు మెడికల్ కాలేజీల్లోనూ దాదాపు 500పైగా ఉద్యోగులను నియమించారు.

పోలీసు శాఖలోనే ఎక్కువ నియామకాలు..



తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు 2022 మార్చిలో నోటిఫికేషన్ ఇస్తే ఆగస్టులో ప్రిలిమ్స్, డిసెంబర్‌లో ఈవెంట్స్, 2023 ఏప్రిల్ 30న మెయిన్స్ జరిగింది. 2024 ఫిబ్రవరిలో అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వడంతో ఫిబ్రవరి 20న శిక్షణ ప్రారంభమైంది. నవంబర్ 20న ఏఆర్ కానిస్టేబుళ్ల శిక్షణ ముగిసి విధుల్లో చేరారు. బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్ల శిక్షణ వచ్చే ఏడాది జనవరి 5వ తేదీతో ముగియనుంది. ఇలా దాదాపు రెండేళ్లకుపైగా ఎదురుచూసిన వేలాది మంది అభ్యర్థులకు ఈ ఏడాది నియామక పత్రాలు చేతికందడంతో సంబురపడిపోయారు. ఇలా వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలను కలుపుకుని ఉన్న వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 900 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 36 మంది ఎస్సైలు చేరారు. అలాగే, మహబూబాబాద్ జిల్లాలో 151, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 123, ములుగు జిల్లాలో 63 మంది పోలీసు సిబ్బంది విధుల్లో చేరారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్రూప్–4లో 825 మంది ఉద్యోగాలు పొందారు. వైద్యవిభాగంతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల్లో 700 మంది వరకు నియామకాలు జరిగాయి.

టీచర్లకు 'మెగా' సంతోషమే..



తెలంగాణలో మెగా డీఎస్సీకి ఫిబ్రవరి 29న ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 11,062 పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్లు, భాషాపండితులు, పీఈటీలు, ఎస్జీటీలు, ప్రత్యేక కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్జీటీ పోస్టులున్నాయి. 2023 సెప్టెంబర్ 6న 5,089 పోస్టులతో జారీ చేసిన ప్రకటనను రద్దు చేసిన అనంతరం ఈ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇలా ఏళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల కోసం వేచిచూస్తున్న వారికి ఈ ఏడాది ఇచ్చిన నోటిఫికేషన్ వరమైంది. జూలై 18 నుంచి ఆగస్టు 5వ తేదీవరకు 26 సెషన్లలో కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ (సీబీటీ) పరీక్షలు నిర్వహించారు. సెప్టెంబర్ 30న ఫలితాలు విడుదల చేశారు. ఇలా వరంగల్ జిల్లాలో 272 మంది, హనుమకొండలో 169, జయశంకర్ భూపాలపల్లిలో 235, ములుగులో 176, మహబూబాబాద్ జిల్లాలో 361 మంది టీచర్లకు పోస్టింగ్ ఇచ్చారు. వీరిలో కొందరు టీచర్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకుని ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు.

క్రీడాభివృద్ధిపై హెచ్‌సీఏకు శ్రద్ధ లేదు

- 'టి' క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి విజయ్‌చందర్‌రెడ్డి
- 8 నుంచి గోల్డ్ ప్రీమియర్ కప్ క్రికెట్ పోటీలు



మాట్లాడుతున్న పెసరు విజయ్‌చందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు నిధులపై ఉన్న శ్రద్ధ క్రీడాభివృద్ధిపై లేదని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని టీసీఏ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 8 నుంచి 18వ తేదీ వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో తెలంగాణ గోల్డ్ ప్రీమియర్ క్రికెట్ కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్టు ప్రవేశ రుసుం రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విజేతకు రూ.50వేలు, రన్నరప్‌కు రూ.25వేల నగదు పారితోషికం అందజేస్తామన్నారు. టీసీఏ జిల్లా జనరల్ సెక్రటరీ తాళ్లపెల్లి జయపాల్ మాట్లాడుతూ పది రోజులు జరిగే మ్యాచ్‌లు హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ మైదానం, వరంగల్ శివారు మొగిలిచర్లలో జరుగుతాయని తెలిపారు. ఇందులో నుంచి ఉత్తమ జట్లను ఎంపిక చేసి జనవరి 26 నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. హెచ్‌సీఏ కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాగా టీసీఏ హైదరాబాద్ మినహా అన్ని జిల్లాల్లో టోర్నమెంట్లు నిర్వహిస్తోందన్నారు. జట్ల రిజిస్ట్రేషన్ కోసం 9581124444, 9700664444 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. టీజీఏ జాయింట్ సెక్రటరీ మహ్మద్ అలీం, ఎం. సమీఅక్మల్ పాల్గొన్నారు.

గన్‌గ్యాంగ్ అరెస్ట్..

- తుపాకీ, రెండు తూటాలు, ఒక కారు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్

మహబూబాబాద్ రూరల్: తుపాకీతో తిరుగుతూ హల్‌చల్ చేస్తున్న ఐదుగురు (గన్ గ్యాంగ్ ముఠా) నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఓ తుపాకీతో పాటు రెండు తూటాలు, ఒక కారు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ తెలిపారు. ఈ మేరకు టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేసముద్రం మండలం ఉప్పరపల్లి క్రాస్ వద్ద ఓ కారు అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు ఆపి అందులో ఉన్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. 2020లో గంజాయి కేసులో మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం చింతపల్లికి చెందిన అందెం గోపి, రాజస్థాన్‌కు చెందిన ప్రవీణ్ భారతి రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించారు. అక్కడ వారిద్దరికి కేరళకు చెందిన జయరాం, ఒడిశాకు చెందిన చంద్రశేఖర్ పరిచయమయ్యారు. దీంతో జయరాం తనకు ఒక తుపాకీ కావాలని చంద్రశేఖర్‌ను అడగగా అతడు ఆ విషయాన్ని అందెం గోపికి తెలిపాడు. వెంటనే గోపి.. ప్రవీణ్ భారతికి చెప్పగా అతడు రాజస్థాన్‌కు చెందిన మరో వ్యక్తి ఇమ్రాన్ ఖాన్‌కు చెప్పగా అతడు గోపికి ఒక తుపాకీ, రెండు తూటాలు ఇప్పించాడు. ఆ తర్వాత చంద్రశేఖర్ తనకు తుపాకీ వద్దని చెప్పగా అందెం గోపి, గోసామి ప్రవీణ్ భారతి, కేసముద్రం మండలం పెనుగొండకు చెందిన మాధవపెద్ది శ్రీకాంత్ రెడ్డి, సీరోలు మండలం చింతపల్లికి చెందిన దొంతగాని సందీప్, వరంగల్ సమీపం భట్టుపల్లికి చెందిన మెరుగు సిద్దార్థ (ఈ ముగ్గురు యువకులు గోపికి మిత్రులు) కలిసి ముఠాగా ఏర్పడి తుపాకీని అమ్మడానికి కారులో ప్రయాణిస్తున్నారు. ఈనెల 29న ఉప్పరపల్లి క్రాస్ వద్ద కారు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అందులో ఉన్న వ్యక్తులను అదులోకి తీసుకుని విచారించగా తుపాకీని అమ్ముదామని తిరుగుతున్నామని నేరం ఒప్పుకున్నారు. దీంతో ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. కాగా, పరారీలో ఉన్న నిందితుడు ఇమ్రాన్ ఖాన్ ను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. ఈ కేసులో ప్రతిభకనబరిచిన మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, కేసముద్రం ఎస్సై మురళీధర్ రాజు, సీసీఎస్ ఎస్సై తాహెర్ బాబా, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, వివిధ విభాగాల డీఎస్పీలు మోహన్, శ్రీనివాస్, విజయ్ ప్రతాప్ పాల్గొన్నారు.

పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి

- తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్ రెడ్డి



మాట్లాడుతున్న దామోదర్ రెడ్డి

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని సంఘం కార్యాలయంలో పెన్షనర్స్‌డే జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతోందని విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలని, అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిలువేరుచంద్రశేఖర్, ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, ఏటీఓలు శ్రీనివాస్ రెడ్డి, అన్వర్ హుస్సేన్, సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు కందుల సంజీవ రెడ్డి, ఎండీ నిజాముద్దీన్, సాంబయ్య, లక్ష్మయ్య, బాలరాజు. మల్లారెడ్డి, ఎం.జనార్దన్, ఆగయ్య, జి.రవీందర్ పాల్గొన్నారు.

వృద్ధుడి హత్య కేసులో నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన కాటారం పోలీసులు



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్

కాటారం: భూ వివాదం నేపథ్యంతో కాటారం మండల కేంద్రంలోని ఇప్పలగూడెం కాలనీలో ఈ నెల 27న జరిగిన హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాటారం సీఐ ఈ.నాగార్జునారావు, ఎస్సైలు మ్యాక అభినవ్, శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన డొంగిరి బుచ్చయ్య(65), సోదారి పవన్, సోదారి లింగయ్య, సోదారి శోభ మధ్య కాటారం శివారులోని లావాణిపట్టా భూమి 30 గుంటలకు సంబంధించి కొన్ని సంవత్సరాలుగా వివాదం కొనసాగుతోంది. పలుమార్లు పంచాయితీలు జరిగినా సమస్య పరిష్కారం కాలేదు. నిందితులు భూమిని దున్నిన ప్రతీసారి మృతుడు బుచ్చయ్య అడ్డుపడుతూ వచ్చేవాడు. దీంతో బుచ్చయ్యను ఎలాగైనా అంతమొందించాలని నిందితుడు పవన్ అతడి తల్లిదండ్రులు లింగయ్య, శోభ పథకం పన్నారు. ఈ నెల 27న ఇప్పలగూడెంకాలనీలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న బుచ్చయ్యను కర్రదుంగతో విచక్షణరహితంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై మృతుడి భార్య సారమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు పవన్, లింగయ్య, శోభను గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల సమీపంలో అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. దీంతో కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు.